

## జీహెచ్ఎంసీలో ఘనంగా మహర్షి జయంతి

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): మహర్షి వాల్మీకి రచనలు, సాహిత్య సృష్టికి, భారతీయులందరికీ గొప్ప ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రామాయణ మహా కావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతీయ సాహిత్యానికి ఒక అద్భుతమైన సంపదను అందించారని పేర్కొన్నారు. వాల్మీకి రచనలో వ్యక్తమైన ధర్మబోధలు, ఆధ్యాత్మికత, న్యాయ, నైతిక విలువలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయని కమిషనర్ ఇలంబర్తి అన్నారు. వాల్మీకి ఆశయాలను గౌరవించి ప్రతి వ్యక్తి ధర్మం, సత్యం, న్యాయ మార్గంలో నడవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సీఎన్ రఘుప్రసాద్, నళిని పద్మావతి, సీపీఆర్వో ముర్తుజా అలీ, ఏఎంసీలు రమణ, శారద, జీహెచ్ఎంసీ ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్, తదితరులు

## హైదరాబాద్‌కు వచ్చే ప్రతి ప్రయాణికుడి రక్షణే మా లక్ష్యం

### శంషాబాద్ ఎయిర్ పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17: హైదరాబాద్‌కు వచ్చే ప్రతి ప్రయాణికుడి రక్షణే తమ లక్ష్యమని శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ తెలిపారు. గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖ, టీహెచ్ఎంఐసీఈతో కలిసి అతిథి దేవో భవ 2024ను రెండో ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ, పర్యాటకులకు ఆత్మీయ స్వాగతం పలకడంతో పాటు సురక్షితమైన ప్రయాణానకనౌ నిర్ధారించడానికి ఆటో, క్యాబ్ డ్రైవర్లు నైపుణ్యం వారి పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని వేయి మంది డ్రైవర్లుకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రయాణికులలో భద్రత పెంచడం కోసం క్యూఆర్ కోడ్ వ్యవస్థతో పాటు పోలీస్ శాఖ భాగ్యస్వామ్యం కీలకమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తెలంగాణ (హైదరాబాద్)కు వచ్చే ప్రయాణికుడికి క్యాబ్ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు వేయి మందికి పైగాడ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం, అత్యవసర సేవలకు సైతం వెనకబడకుండా ఉండటం కోసం డ్రైవర్లకు సీపీఆర్‌పై అవగాహన కల్పించిన్నట్లు తెలిపారు. సమావేశంలో పలువురు వైద్యులతో పాటు పర్యాటక శాఖ అధికారులు క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు!

### క్రీడాభివృద్ధికి స్వతహాగా ఖర్చు చేయలేని దుస్థితిలో నిర్ణయం

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలోకి తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న సంస్థ స్వతహాగా క్రీడాభివృద్ధికి పాటుపడేలా పరిస్థితులు లేవు. గడిచిన కొన్ని నెలలుగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, క్రీడా ప్రాంగణాల నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ నేపథ్యంలోనే యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకున్నది. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్‌ను ప్రయోగాత్మకంగా రెండు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ జోన్‌లో తొమ్మిది స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, 200 క్రీడా ప్రాంగణాలు ఉండగా, ఇందులో ప్రయోగాత్మకంగా తొలుత అమీర్‌పేట, షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఎంపిక చేసింది. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేసి ఐదేళ్ల పాటు పీపీపీ పద్ధతిలో నిర్వహణను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆసక్తి గల ఏజెన్సీలు ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్ఎఫ్‌పీ టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 21 సాయంత్రం సాయంత్రం 5 గంటలకు టెండర్ దాఖలుకు తుది గడువు విధించారు. 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలకు టెండర్ తాలుకా దరఖాస్తులను తెరిచి అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు.



## వర్ష సూచన

సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడి అల్పపీడనంగా మారింది. దీని ప్రభావంతో రాగల 2రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

---

### పెండింగ్ బోధనా రుసుములు, ఉపకార వేతనాలపై

# విద్యార్థుల నిరసన గళం

### ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల విద్యార్థుల నిరసన ర్యాలీలు, ధర్నా




ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లో విద్యార్థుల నిరసన ర్యాలీ




ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ చౌరస్తా వద్ద బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ విద్యార్థులు

కాప్రా, అక్టోబర్ 17: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, బీఈడీ తదితర కోర్సులకు సంబంధించి రూ.7700 కోట్ల బోధనా రుసుములు, ఉపకార వేతనముల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పలు కళాశాలల విద్యార్థులు జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా వరకు సుమారు 400ల మంది బాధిత విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అదే పథకానికి తూట్లు పొడుస్తున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. మూడేళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములు, ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, కార్యవర్గ సభ్యులు మహేష్, సొహైల్, అజీమ్ పాషా, ఆర్తి, ఆస్మా, దేవి, సంధ్య, నీలిమ, కీర్తన, నయన, స్వాతి, మంజులత పాల్గొన్నారు.



జల మండలి కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

## జల మండలిలో వాల్మీకి మహర్షి జయంతి

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): జల మండలిలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులు హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు స్వామి, విజయారావు, సీజీఎం ప్రభు పాల్గొన్నారు.

### హైదరాబాద్ కలెక్టరేట్‌లో..

మహనీయుల చరిత్ర చదివి స్ఫూర్తి పొందాలని అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో రామాయణ మహాకావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి అదనపు కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, సీపీఓ డాక్టర్ సురేందర్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీరామ్, డీపీఆర్ఓ అబ్దుల్ కలీం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రమేష్ పాల్గొన్నారు.



హైదరాబాద్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కదిరవన్, ఉద్యోగులు

## ప్రజాస్వామ్యాన్ని కూల్చేలా.. మోదీ వ్యవహారం

### సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 17: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూల్చే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపా చట్టాన్ని రద్దు చేయాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ రాష్ట్ర కర్యాదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ, వీఎస్ బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రవీంద్రచారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపా చట్టంతో దుర్మార్గమైన హింసాకాండను అమలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజాస్వామిక వాధులంతా ఏకతాటిపైకి వచ్చి జాతీయ స్థాయిలో ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం ఎవరు? అని ప్రశ్నించారు. ఉపా చట్టానికి ట్రయల్ ఉండదని, బెయిల్ ఉండదని దుర్మార్గమైన చట్టమని విమర్శించారు. ఉపా చట్టంలో అరెస్టు అయిన వారిలో కేవలం మూడు శాతం వరకే నేరాలు నిరుపించారని, 97 శాతం నిరూపణ కాలేదని తెలిపారు. సాయిబాబాను పదేళ్లు జైల్లో పెట్టారని, చేతులు కాళ్లు పని చేయని సాయిబాబాను సెల్‌లో నిర్బంధించి, త్రీవంగా హించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా మరణం రాజ్యం చేసిన కక్షనే అని అన్నారు. ఈ నిరసన దీక్షలో మావనవ హక్కుల సంఘం నాయకుడు అన్వర్ ఖాన్, సీపీఐ సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి, యాదగిరి, స్టాలిన్, ఎం.ఆదిరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నాయకులు భల్లా రవి పాల్గొన్నారు.




నిరసన దీక్షలో ప్రొఫెసర్ హరగోపాల్, చాడ వెంకట్ రెడ్డి తదితరులు



## ఓయూలో.. పోలీసు పికెటింగ్



గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలనే అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం విద్యార్థుల ర్యాలీలు, ధర్నాలను నిలువరించేలా పోలీసులు భారీ బందోబస్త్ నిర్వహించారు. ఈ క్రమంలో యూనివర్సిటీ పరిధుల్లో పోలీసుల సంచారం అధికమైంది. నిత్యం ఉద్యోగార్థులు, విద్యార్థులతో కిటకిటలాడే యూనివర్సిటీ గ్రంథాలయం సందడిని కోల్పోయి నిర్మానుష్యంగా కనిపించింది.

## డిసెంబర్‌లోగా సీవరేజీ టన్నెలింగ్

### క్షేత్రస్థాయి పనుల పరిశీలనలో జల మండలి ఎండీ

సిటీబ్యూరో, అక్టోబరు 17(నమస్తే తెలంగాణ): సీవరేజీ ఓవర్ ఫ్లో నివారణపై జల మండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఓ అండ్ ఎం డివిజన్ - 5 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎండీ అశోక్ రెడ్డి పర్యటించారు. బర్కత్‌పుర, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో చేపడుతున్న డీ సిల్టింగ్, సీవరేజ్ టన్నెలింగ్ పనులను పరిశీలించారు. కింగ్ కోఠి, కాచిగూడలో జరుగుతున్న సీవరేజి టన్నెలింగ్ పనులను ఎండీ పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని, అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలని ఎండీ సూచించారు. పనులు జరిగే సమయంలో రక్షణ చర్యలను పాటించాలన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో జరుగుతున్న టన్నెలింగ్ పనులు దాదాపు కింగ్ కోఠి వద్ద 200 మీటర్లు, కాచిగూడ వద్ద 200 మీటర్లు, బషీర్‌బాగ్ వద్ద 200 మీటర్లు టన్నెలింగ్ పనులు పూర్తి చేయనున్నారు.



రహమత్ అలీకి అభినందనలు తెలుపుతున్న సంఘం నాయకులు

## వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా రహమత్ అలీ

అబిడ్స్, అక్టోబర్ 17: తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా రహమత్ అలీ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ జిల్లాలు, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంతా కలిసి మహ్మద్ రహమత్ అలీని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రహమత్ అలీ మాట్లాడుతూ, వాణిజ్య పన్నుల శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వివిధ జిల్లాలు, డివిజన్ల అధ్యక్షుడు కార్యదర్శులు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, హరిప్రసాద్, దేవులపల్లి శ్రీనివాస్, మధు, శ్రీనివాస్ ప్రసాద్, అబ్దుల్ మాలిక్, రవీంద్ర నాయక్, సునీల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, జాఫర్ అలీ, గడ్డం శ్రీనివాస్, అరుణ్ రెడ్డి, నాగరాజు, వెంకటరాంరెడ్డి, సందీప్, నాగు నాయక్, సయీద్ ఖాన్, ప్రభాకర్, ఫణీంద్ర ప్రసాద్, క్రాంతి కుమార్, ముజాహిద్ పాష, మిర్యాల పురుషోత్తం, స్వామి పాల్గొని రహమత్ అలీకి అభినందనలు తెలిపారు.

## గ్రూప్-1 పరీక్షను రీషెడ్యూల్ చేయాలి: ప్రొ॥ వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: తెలంగాణ రాష్ట్రంలో ఏడు శాతం జనాభా లేని అగ్ర వర్ణాలకు యాభై శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్న జీవో 29ను తక్షణమే రద్దు చేసి, గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. జీవో 29ను వెంటనే రద్దు చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గ్రూప్-1 అభ్యర్థులు గురువారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, 30 లక్షల నిరుద్యోగుల సహకారంతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో 29ని తీసుకువచ్చి 93 శాతం జనాభా ఉన్న బహుజన నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. హైకోర్టులో టీజీపీఎస్సీపై 14 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్ని పరీక్షలు రద్దు చేసి కేవలం గ్రూప్-1 నోటిఫికేషన్‌లో 63 పోస్టులు కలిపి రీషెడ్యూల్ చేసిందని దుయ్యబట్టారు. జీవో 29ని తీసుకువచ్చి, బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జన పరిషత్ నాయకుడు విజయరాజ్, గ్రూప్-1 అభ్యర్థులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, చిత్రంలో తదితరులు

## గ్రూప్-1 పరీక్షకు 17762 మంది అభ్యర్థులు



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 17: గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు జిల్లా నుంచి 17762 మంది అభ్యర్థులు హాజరుకానున్నరని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ, జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలలో గ్రూప్-1 పరీక్షలు జరుగుతాయని, అధికారులకు ఈ నెల 15న సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఆర్ఓ హరిప్రియ, అధికారులు పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో ఫుట్‌పాత్‌లపైనున్న నిర్మాణాలను తొలగిస్తాం

### ట్రాఫిక్ విభాగంతో హైడ్రా బృందం సమీక్షా సమావేశం

సిటీబ్యూరో, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి ట్రాఫిక్ విభాగంతో కలిసి పనిచేస్తూ నగరంలో ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో పాటు ప్రభుత్వ విభాగాలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు, టెలిఫోన్ డక్‌లు, జీహెచ్ఎంసీ చెత్త డబ్బాలు తొలగించే ప్రక్రియ త్వరలోనే చేపడ్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గురువారం నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ కార్యాలయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిటీ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు విభాగాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని, భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వంటి ముఖ్య సమయాల్లో ట్రాఫిక్ కంట్రోలింగ్‌కు ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా డీఆర్ఎఫ్ బృందం పనిచేయడానికి కావల్సిన ఏర్పాట్లు చేస్తామని రంగనాథ్ తెలిపారు. ఇరు శాఖలు గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిల్వకుండా చూడటంతో నగరంలో ఉన్న 144 వాటర్ లాగింగ్ పాయింట్లలో 65 పాయింట్లు హైరాబాద్‌లోనే ఉన్నాయని, ప్రాధాన్యతాక్రమంలో ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న శాశ్వత దుకాణాలను ముందస్తు సమాచారం ఇచ్చి తొలగిస్తామని చెప్పారు. నగరంలో కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను, కొమ్మలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. సమావేశంలో హైడ్రా అధికారులతో పాటు ట్రాఫిక్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ తదితరులు